సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 12 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.38,290

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38,290, కనిష్టంగా రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.16, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.7°/17.2°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. పలు ప్రాంతాల్లో చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పట్టు' మెరుస్తోంది!



మార్కెట్‌కు వచ్చిన పట్టు గూళ్లు

హిందూపురం అర్బన్: దిగుబడి తగ్గినా పట్టు గూళ్ల ధర మాత్రం మెరుస్తోంది. చలి తీవ్రత పెరగడం, పంట సరిగా చేతికందక పోవడంతో మార్కెట్‌కు వచ్చే పట్టుగూళ్లు తగ్గిపోయాయి. గతంలో హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌కు నిత్యం 3 నుంచి 12 టన్నుల వరకు పట్టు గూళ్లు వచ్చేవి. బుధవారం మార్కెట్‌కు కేవలం 1,870 కిలోల పట్టు గూళ్లు (బైవోల్టిన్) మాత్రమే వచ్చాయి. దీంతో రైతులు ఆశించిన ధర దక్కింది. మొదటి రకం గూళ్లు కిలో రూ.705, రెండో రకం రూ.605, మూడోరకం పట్టు గూళ్లు కిలో రూ. 464 ప్రకారం పలికినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీరెడ్డి తెలిపారు.

'మెగా సప్లి'ని సద్వినియోగం చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 2016 నుంచి 2019 మధ్య డిగ్రీ చదివి వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మెగా సప్లిమెంటరీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మశ్రీ సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హాల్ టికెట్ నంబరు 17, 18, 19 సిరీస్‌తో మొదలైన విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షలు రాసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు కళాశాలలోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

త్వరలో మరో 'వందేభారత్'!

- విజయవాడ నుంచి బెంగళూరు మధ్య రాకపోకలు

అనంతపురం సిటీ: జిల్లా మీదుగా త్వరలో మరో వందేభారత్ రైలు నడవనున్నట్లు తెలిసింది. విజయవాడ-బెంగళూరు వయా అనంతపురం మీదుగా ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇప్పటికే కాచిగూడ-యశ్వంత్‌పూర్, కలబురిగి-బెంగళూరు వయా అనంతపురం మీదుగా తిరిగే రెండు వందేభారత్ రైళ్లకు విశేష ఆదరణ లభిస్తోంది. దీంతో రైల్వే శాఖ అధికారులు కొత్తగా మరో వందేభారత్ నడిపేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. గుంటూరు నుంచి పల్నాడు మీదుగా నంద్యాల, డోన్, గుంతకల్లు, అనంతపురం, హిందూపురం, యలహంకలో స్టాపులు ఉండేలా ప్రతిపాదించారు. రైల్వే శాఖ సాంకేతిక అంశాలపైనా నివేదిక కోరిందని, నెలాఖరులోగా దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. గుంటూరు నుంచి బెంగళూరుకు సుమారు 16 గంటల సమయం పడుతోందని, దీంతో ప్రయాణికులు, వివిధ వర్గాల వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లారు. ఈ మార్గంలో కొత్త రైలు అవసరాన్ని వారు వినిపించగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

అరటితోటలో కొండచిలువ!



కొండచిలువను తరలిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోని తురకవారిపల్లి గ్రామానికి చెందిన గొంది శ్రీరాములు అరటి తోటలో బుధవారం భారీ కొండచిలువ కనిపించింది. శ్రీరాములు ఉదయం 10 గంటల సమయంలో పంటకు నీరు పెట్టేందుకు తోటకు వెళ్లగా... ఎండిపోయిన అరటి ఆకుల మధ్య 12 అడుగుల పొడవున్న కొండచిలువ కనిపించింది. దీంతో భయపడిపోయిన రైతు సమీప తోటల్లో ఉన్న రైతులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ... రైతుల సాయంతో కొండ చిలువను పట్టుకుని అటవీప్రాంతంలో వదిలారు.

కూటమి పగ.. రైతు దగా



ప్రభుత్వ సాయం కరువైంది. సాగు సంకటంలో పడింది. ఆదుకోవాల్సిన పాలకులు జాగు చేస్తుండగా...రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఖరీఫ్ పంటలు తుడిచి పెట్టుకుపోగా.. రబీకి పెట్టుబడి లేక చాలా మంది పొలాలను బీళ్లుగా వదిలేశారు. రైతు కుటుంబాలు వలస బాట పట్టగా పల్లెలు కళ తప్పాయి.

- ఆరు నెలలుగా పైసా విదల్చని ప్రభుత్వం
- 'అన్నదాత సుఖీభవ' ఊసే లేదు
- ఉచిత పంటల బీమాకు మంగళం
- పంట నష్ట పరిహారానికి ఎగనామం
- దిక్కుతోచని స్థితిలో రైతన్న
- రేపు 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' పోరుబాట

పుట్టపర్తి అర్బన్: 'అన్నదాత సంక్షేమమే ధ్యేయం...' అన్నదాత సుఖీభవ' పేరుతో ఏటా రూ.20 వేల సాయం అందిస్తాం.. రైతుకు ఇబ్బంది కలగకుండా చూసుకుంటాం' అని హామీలు గుప్పించిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని పూర్తి విస్మరించారు. దీంతో రైతుల ఆశలన్నీ అడియాసలయ్యాయి.

కరువు మండలాల ప్రకటనతో సరి..

ప్రకృతి కరుణించక పంట చేతికి అందలేదు. ప్రభుత్వం పంట నష్ట పరిహారమూ ఇవ్వలేదు. జిల్లాలో కేవలం 10 మండలాలను కరువు జాబితాలో చేర్చి చేతులు దులుపుకుంది. పోనీ ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేసుకున్న రైతులకు పంట నష్ట పరిహారం ప్రకటిస్తారా అంటే అతీగతీ లేదు. ఇక రబీ సీజన్‌లో విత్తన వేరుశనగ కాయలూ సకాలంలో పంపిణీ చేయలేదు. ప్రకృతికి ఎదురొడ్డి సాగు చేసిన పంటలను తుపాను తుడిచిపెట్టేసింది. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కుటుంబ భారంతో సతమతమవుతున్నారు.

డబ్బు చెల్లిస్తేనే పంటల బీమా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు మంచి చేయాల్సింది పోయి...ఉన్న పథకాలను రద్దు చేసింది. ముఖ్యంగా పంట నష్టం జరిగితే రైతును ఆదుకునే ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. దీంతో ఈ రబీ సీజన్ నుంచి రైతులు పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వరి పంట ఎకరాకు రూ.630, టమాటాకు ఎకరాకు రూ.1,600, వేరుశనగ ఎకరాకు రూ.480, మామిడికి రూ.1,620 చొప్పున ప్రీమియం నిర్ణయించిందని, ఇది కేవలం ఒక సీజన్‌కు మాత్రమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకే ఇబ్బందులు పడుతున్న తాము, ప్రీమియం ఎలా చెల్లించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులు ఒక్క రూపాయి చెల్లించకుండానే ఉచిత పంటల బీమా అమలు చేశారని గుర్తు చేసుకుంటున్నారు. జగన్ హయాంలో జిల్లాలో ఏడాదికి సగటున 1.77 లక్షల మంది రైతులకు నాలుగేళ్లలో రూ.718.57 కోట్లు లబ్ధి చేకూర్చిందని చెబుతున్నారు.

3,12,292	జిల్లాలో రైతుల సంఖ్య
3,65,874	జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో..)
రూ. 20,000	ప్రభుత్వం రైతులకు ఏడాదికి ఇస్తానన్న మొత్తం
రూ. 624,58,40,000	జిల్లా రైతులకు అందాల్సిన నగదు

'అన్నదాత సుఖీభవ'కు మోక్షమెప్పుడో..

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నేతలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఏడాదికి రూ.20 వేల చొప్పున ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరచిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు మంత్రులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా తమ సమస్యలు కనీసం చర్చకు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 3,12,592 మంది రైతులు అన్నదాత సుఖీభవ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో వైఎస్ జగన్ రైతులు అడగకున్నా ఏటా రూ.13,500 ప్రకారం క్రమం తప్పకుండా రైతు ఖాతాల్లో జమ చేశారని, ఏ సీజన్‌లో పంటలు నష్టపోతే అదే సీజన్‌లో పరిశీలన చేసి పంట నష్ట పరిహారం అందజేశారని గుర్తు చేసుకుంటున్నారు.

కరువు మండలాల ప్రకటనతో సరిపెట్టారు..

జిల్లాలోని తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్‌పీకుంట, పరిగి, రామగిరి, గాండ్లపెంట, బుక్కపట్నం మండలాలను కూటమి ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చినా రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. తక్కిన 22 మండలాల్లో పంటలకు నష్టం జరిగినా ఆదుకునే ప్రకటనా చేయలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో మొత్తం 1,435 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. అయితే దీన్ని ప్రాథమిక అంచనా కింద చూపి వ్యవసాయాధికారుల పరిశీలన అనంతరం 329 హెక్టార్లకు కుదించారు. దీంతోపాటు 53 హెక్టార్లలో ఉద్యాన పంటలూ రైతులు కోల్పోయారు. నెల రోజులు గడిచినా పరిహారం ఊసేలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైతుకు అండగా పోరుబాట..

ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు చేయడంతో పాటు రైతు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది. ఈ నెల 13న పుట్టపర్తిలో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనుంది. ర్యాలీకి మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు.

వైఎస్సార్ సీపీ డిమాండ్‌లు ఇవీ....

- తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి
- సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేయాలి
- ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే దళారీ వ్యవస్థను తొలగించాలి
- తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలి
- ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి
- రైతుపై అదనపుభారం మోపే చర్యలను మానుకోవాలి

రైతు సంక్షేమం పట్టదా?



కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఆరు నెలలైనా రైతుల కోసం పైసా విదల్చలేదు. పైగా గతంలో వైఎస్ జగన్ సర్కార్ అమలు చేసిన ఉచిత పంటల బీమాకు మంగళం పాడింది. ఎరువులు, పురుగు మందులు, విద్యుత్ ధరలు పెంచి రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల కోసం పనిచేయాలి. రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి.
– కృష్ణారెడ్డి, చౌటకుంటపల్లి, నల్లమాడ మండలం

రూ.20 వేలు ఇవ్వాలి



ఎన్నికల హామీల్లో భాగంగా ఏటా రైతులకు ఇస్తానన్న రూ. 20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి వెంటనే పరిహారం అందజేయాలి. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించాలి. వైఎస్ జగన్ హయాంలో అమలు చేసిన ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి.
– లక్ష్మీపతి, రైతు, సుబ్బరాయనిపల్లి

రైతుల కోసమే పోరుబాట

- రేపు పుట్టపర్తిలో భారీ ర్యాలీ
- పార్టీశ్రేణులు, నాయకులు, రైతులు తరలిరావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



శ్యాపురంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: ''ఆరు నెలలు వేచి చూశాం. అయినా ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. ముఖ్యంగా రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. అందుకే ఈనెల 13న అన్నదాతల కోసం వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టింది'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం ఆమె మండలంలోని శ్యాపురం గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి 'అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ' కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు.

నమ్మించి నట్టేట ముంచిన చంద్రబాబు..

ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను నమ్మించి నట్టేట ముంచారని ఉషశ్రీచరణ్ ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. గతంలో ఆర్‌బీకేల ద్వారా గ్రామాల్లోనే రైతులకు అన్ని రకాల సేవలు అందేవన్నారు. అలాగే జగన్ సర్కార్ పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేదని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసగించిందన్నారు. ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం చేస్తామని చెప్పి నిండా ముంచేశారన్నారు. కనీసం నష్టపరిహారం ఇవ్వకపోవడం.. పండించిన పంటకు మద్దతు ధర కల్పించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ సమయంలో వారికి అండగా నిలబడేందుకు కూటమి సర్కారుపై వైఎస్సార్ సీపీ పోరుబాటకు సిద్ధమైందన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. తర్వాత కలెక్టర్ చేతన్‌ను కలిసి రైతు సమస్యలపై వినతి పత్రం అందజేస్తామన్నారు. రైతు వ్యతిరేకిగా మారిన కూటమి సర్కారు మెడలు వంచేందుకు చేపడుతున్న ర్యాలీలో రైతులు, ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్ సీపీ రొద్దం మండల కన్వీనర్ తిమ్మయ్య, పెనుకొండ నగర కన్వీనర్ నరసింహులు, సోమందేపల్లి మండల కన్వీనర్ గజేంద్ర, శ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్ వలి, సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు అక్కులప్ప, కొండలరాయుడు, బేల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హలో చెబితే అరుణాచలం రూట్ మ్యాప్

- గిరిప్రదక్షిణకు వెళ్లే వారు పోలీస్ సూచనలు పాటించాలి
- ఎస్పీ రత్న వెల్లడి



పుట్టపర్తి టౌన్: అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులు 9363622330 నంబర్‌కు హలో అని వాట్సాప్‌లో మెసేజ్ పంపితే రూట్ మ్యాప్, పార్కింగ్ లింక్ వస్తుందని ఎస్పీ రత్న తెలిపారు. ఈనెల 13వ తేదీన అరుణాచల గిరిప్రదక్షిణకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశముందని, అందువల్ల జిల్లా నుంచి వెళ్లే భక్తులంతా పోలీసుల సూచనలు పాటించాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. తిరుపతి, చిత్తూరు రహదారుల నుంచి వెళ్లే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల కోసం వెల్లూరు రోడ్డులోని తాయి ముంగాంబికనగర్, తిరువణ్ణామలై బైపాస్ రోడ్డు సమీపంలోని ఏకేఎస్ నగర్‌లలో తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేశారని, బస్సులు అక్కడే నిలపాలన్నారు. ఇక కార్లు, ఇతర వాహనాలను వెల్లూరు రోడ్డులో ఏర్పాటు చేసిన 13 తాత్కాలిక పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలపాలన్నారు. ఈ రెండు ప్రాంతాల నుంచి దేవస్థానానికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు.

- దేవాలయ గోపురాల వద్ద దీపాలు, కర్పూరాలు వెలిగించడం నిషేధమని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. వైద్యం, ఇతర సహాయం కోసం సమీపంలోని 'మే ఐ హెల్ప్ యూ' బూత్‌లో ఉండే పోలీసులను సంప్రదించాలన్నారు. గిరిప్రదక్షిణ రహదారి సమీపంలోని నీటి కొలనులోకి వెళ్లరాదని, అధికారుల అనుమతులు లేనిదే సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లడం గానీ, కొండలు ఎక్కడం గానీ చేయరాదన్నారు. జిల్లా నుంచి అరుణాచలం వెళ్లే భక్తులు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని ఎస్పీ సూచించారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



పోలీస్ జట్లకు సూచనలు ఇస్తున్న పీఈటీ

పుట్టపర్తి టౌన్: పోలీస్ పరేడ్ మైదానంలో బుధవారం పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. తొలిరోజు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆరు జట్లు తలపడగా ఆర్మ్‌డ్ రిజర్వ్, హిందూపురం, ధర్మవరం సబ్ డివిజన్ జట్లు విజయం సాధించాయి. ఉదయం హిందూపురం అర్బన్, ఆల్‌వింగ్ పోలీస్ జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. నిర్ణీత 12 ఓవర్లలో హిందూపురం సబ్ డివిజన్ జట్టు 107 పరుగులు చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆల్‌వింగ్స్ పోలీస్ జట్టు 67 పరుగులకే ఆలౌట్ అయింది. హిందూపురం సబ్ డివిజన్ జట్టు 47 పరుగులతో విజయం సాధించింది. అనంతరం ధర్మవరం, పుట్టపర్తి సబ్ డివిజన్ల జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించగా, ధర్మవరం సబ్ డివిజన్ జట్టు 16 పరుగులతో విజయం సాధించింది. ఆర్మ్‌డ్ రిజర్వ్, కదిరి సబ్‌డివిజన్ జట్ల మధ్య జరిగిన మరోమ్యాచ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు 25 పరుగుల తేడాతో విజయం సాధించింది. గురువారం సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు శ్రీనివాసులు, మహేష్, సీఐలు శ్రీనివాసులు, వలి, మహేష్, ఆర్‌ఎస్‌లు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్‌సింగ్, ప్రసాద్‌తో పాటు పీఈటీలు పాల్గొన్నారు.

21న దిశ కమిటీ సమావేశం

అనంతపురం సిటీ: శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం ఈ నెల 21న నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించాల్సిన 'దిశ' సమావేశాన్ని ఎన్నికల కారణంగా వాయిదా వేస్తూ వచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లు పూర్తవుతున్నా శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించిన 'దిశ' కమిటీ సమావేశం ఏర్పాటు చేయలేదు. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాలు, ఇతర కారణాల వల్ల సమావేశం వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో దిశ కమిటీ చైర్మన్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథితో చర్చించి సమావేశాన్ని ఖరారు చేశారు. ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ భవన్‌లో ఎంపీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమిటీ సభ్యులు హాజరు కానున్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు సమాచారం చేరవేసినట్లు సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం అక్రమ తరలింపు కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

గోరంట్ల: మద్యం అక్రమ తరలింపు కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,01,000 జరిమానా విధిస్తూ పెనుకొండ ప్రిన్సిపల్ మెజిస్ట్రీరియల్ కోర్టు జడ్జి బొజ్జప్ప బుధవారం తీర్పు చెప్పారు. గోరంట్ల సీఐ శేఖర్ తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని ముద్దులకుంటపల్లికి చెందిన లక్ష్మీనారాయణ కుమారుడు వెంకటేశు 2021 నవంబర్ 6వ తేదీ రాత్రి కర్ణాటక నుంచి మద్యం తీసుకువస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో అప్పటి గోరంట్ల సీఐ జయా నాయక్ కేసు నమోదు చేసి వెంకటేశును అరెస్టు చేశారు. అనంతరం పెనుకొండ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం విచారణకు రాగా, ఏపీపీ శ్యామల వాదనలు వినిపించారు. నేరం రుజువుకావడంతో వెంకటేశుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,01,000 జరిమానా విధిస్తూ జడ్జి బొజ్జప్ప తీర్పు ఇచ్చారని సీఐ శేఖర్ వెల్లడించారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఆనంద్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆనంద్, రాజమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మేడాపురంలోని జగనన్న కాలనీలో నివాసముంటున్న ఆనంద్... కూలి పనులతో పాటు చికెన్ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆనంద్ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఆనంద్ మృతిపై అన్న ఈశరయ్య, బంధువులు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

మహిళ కూలీ దుర్మరణం

బుక్కరాయసముద్రం: ట్రాక్టర్ పై నుంచి కింద పడి ఓ మహిళా కూలీ దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం నీలాంపల్లికి చెందిన షకీనాబీ (33), హుస్సేన్ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం నీలాంపల్లికి చెందిన ఓ రైతు పొలంలో ట్రాక్టర్‌కు గడ్డి వేసే పనులకు షకీనాబీ వెళ్లింది. తోటలో ట్రాక్టర్ ట్రాలీలో గడ్డి నింపి దానిపై కూర్చొని ప్రయాణిస్తున్న ఆమె మార్గమధ్యంలో కుదుపులకు అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పుట్టపర్తి టౌన్: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 14న ఉదయం 6.30 గంటలకు పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుంది. ఈ మేరకు డిపో మేనేజర్ ఇనాయతుల్లా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరుణాచలంతో పాటు వేలూరు గోల్డన్ టెంపుల్, కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయాలను చూపించేలా బస్సు రూట్‌ను ఏర్పాటు చేశారు. ఆసక్తి ఉన్న వారు ఆన్‌లైన్ ద్వారా లేదా, పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో టికెట్లు రిజర్వ్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 73828 59729, 99592 25857, 94402 01570లో సంప్రదించవచ్చు.

రారండోయ్ వేడుక చూద్దాం!

జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన భక్తరపల్లిలో ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరియనుంది. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడగుంట ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఈనెల 13 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- భక్తరపల్లిలో వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక సౌరభం
- రేపటి నుంచి ప్రారంభం కానున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్న భూతప్ప, జ్యోతుల ఉత్సవాలు


లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్


ఆంజనేయస్వామి మూలవిరాట్


భక్తులపై నుంచి నడుచుకుంటూ వెళుతున్న భూతప్ప (ఫైల్)

మడకశిర రూరల్: మండల కేంద్రానికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న భక్తరపల్లిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడగుంట ఆంజనేయస్వామిని కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా భక్తులు కొలుస్తున్నారు. శాలివాహన శకం 1200 సంవత్సరంలో వ్యాసరాయలు స్వయంగా తాను పూజిస్తున్న లక్ష్మీనరసింహస్వామి సాలిగ్రామాన్ని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ లక్ష్మీనరసింహస్వామిని భక్తులు ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారు. అలాగే భక్తరపల్లికి కిలోమీటరు దూరంలో ఉన్న జిల్లెడుగుంట గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికీ దివ్యమైన చరిత్ర ఉంది. 1447–1539 మధ్య కాలంలో వ్యాసరాయలు ప్రతిష్ఠించిన 732 ఆంజనేయస్వామి విగ్రహాల్లో ఇది కూడా ఒక్కటి కావడం విశేషం. ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశి నుంచి బహుళ విదియ వరకూ ఈ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు.

గ్రామాల్లో పండుగ వాతావరణం..

మడకశిర మండలం హరేసముద్రం పంచాయతీ పరిధిలోని భక్తరపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండగా, వైబీహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లెడుగుంట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో ఈ రెండు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటోంది. ప్రతి ఇంటిని నీటితో శుభ్రం చేసుకోవడంతో పాటు నూతన దుస్తులు ధరించి ఎంతో భక్తి శ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రెండు రోజులగా ముందుగానే వస్తుంటారు.

13 నుంచి బ్రహ్మోత్సవాలు..

భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 13న ప్రారంభమై 19న ముగియనున్నాయి. ఈ నెల 13న ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అదే రోజు ఆలయాల్లో విశేష అభిషేకాలు, హనుత్ వ్రతం, హోమాలు ఉంటాయి. 14న కల్యాణోత్సవం, 15న బ్రహ్మరథోత్సవం, 16న భూతప్పలు, జ్యోతుల ఉత్సవం, 17న పూలపల్లకి, ముత్యాలపల్లకి, గరుడోత్సవం ,18న కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష, శయనోత్సవం, 19న వసంతోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు

భక్తరపల్లి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నారు. బ్రహ్మరథోత్సవం, భూతప్ప, జ్యోతుల ఉత్సవాల రోజు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల నుంచి గ్రామాల మీదగా బస్సులు తిరుగాడనున్నాయి.

భూతప్ప ఉత్సవాలే ప్రత్యేక ఆకర్షణ..

వారం రోజుల పాటు జరిగే భక్తరపల్లి బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా భూతప్పల, జ్యోతుల ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నవారు, సంతానలేమితో ఇబ్బంది పడుతున్న వారు భూతప్పల ఉత్సవం రోజు వేకువజామునే స్నానం చేసి తడిదుస్తులతోనే భూతప్పలు వచ్చే దారిలో పడుకుంటారు. భూతప్పల కాలిస్పర్శతో వ్యాధులు నయమవుతాయని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి వేరుశనగ, కొబ్బరి, బొరుగులు, అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకుంటారు.

అంతా మంచి జరుగుతోంది



లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆశీస్సులతో అంతా మంచి జరుగుతోందని ఇక్కడి వారు నమ్ముతారు. ఈ ఉత్సవాలు ప్రారంభం నుంచి ముగిసే వరకూ గ్రామాల్లో పండుగ వాతావరణం ఉంటుంది. ఆలయాల అభివృద్ధికి భక్తులు, దాతలు విరాళాలు అందించి మొక్కులు తీర్చుకుంటుంటారు. గత ఏడాది ఉత్సవాల సందర్భంగా బెంగళూరుకు చెందిన ఓ భక్తుడు ధ్వజస్తంభాన్ని తయారు చేయించి ప్రతిష్ఠించారు.

– లక్ష్మమ్మ, క్యాంపురం, మడకశిర మండలం

ఏర్పాట్లు పూర్తి



బ్రహ్మోత్సవాలకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యలూ కల్పించాం. ఆయా దేవాలయాల వద్ద 11 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పోలీసు అధికారుల సూచన మేరకు గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకున్నాం.

– నరసింహరాజు, ఈఓ, గ్రూపు ఆలయాలు, మడకశిర డివిజన్

చికిత్స ఫలించక స్టోర్ డీలర్ మృతి

గోరంట్ల: మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన స్టోర్ డీలర్, మల్లాపల్లి పంచాయతీ టీడీపీ కన్వీనర్ శ్రీధర్ రెండు రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. తాను కొనుగోటు చేసిన భూమిలో పంటల సాగు విషయంగా అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డి సోదరులు ఆటంకాలు కలిగిస్తుండడంతో మనస్తాపం చెందిన సోమవారం విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు అదే రోజు తొలుత గోరంట్లలోని ప్రభుత్వాస్పత్రికి, అనంతరం బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి బెంగళూరులో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య


నేత్రావతి (ఫైల్)

రొళ్ల: మండల కేంద్రానికి చెందిన వివాహిత నేత్రావతి (32) ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బాలాజీ తెలిపిన మేరకు.. రొళ్ల గ్రామానికి చెందిన చాకలి సతీష్, నేత్రావతి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సతీష్ బేల్దారి పనులు చేస్తుండగా, రత్నగిరి రోడ్డులో నేత్రావతి ఓ హోటల్‌ను నిర్వహిస్తోంది. గత ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్న నేత్రావతికి కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అయినా నయం కాలేదు. మంగళవారం రాత్రి నొప్పి తీవ్రత భరించలేని ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. అదే సమయంలో ఇంటికి చేరుకున్న భర్త గమనించి, కుటుంబసభ్యుల సాయంతో ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కర్ణాటకలోని శిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఎలుగుబంటి దాడి... వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయదుర్గం టౌన్: మండలంలోని ఆర్‌బీవంక గొల్లలదొడ్డి గ్రామంలో పంట కాపలాకు వెళ్లిన బాగురప్పపై ఎలుగుబంటి దాడి చేసి గాయపర్చింది. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పొలంలో కుక్కలు మొరగడంతో అడవిపందులు వచ్చి ఉంటాయని భావించిన బాగురప్ప లేచి కేకలు వేయడంతో హఠాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. అక్కడే ఉన్న మరో వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి బెదిరి సమీపంలోని గుట్టలోకి పరుగు తీసింది.

నేడు ఓట్ల లెక్కింపు

గుంతకల్లు: రైల్వే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు పూర్తి కావడంతో కీలకమైన ఓట్ల లెకింపు ప్రక్రియను గురువారం చేపట్టనున్నారు. స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. డివిజన్ వ్యాప్తంగా 14,359 ఓటర్లు ఉండగా 12,358 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 86.06 శాతం ఓటింగ్ నమోదైంది. పోలైన వాటిలో 35 శాతం ఓట్లు ఏ సంఘానికి దక్కుతాయో ఆ సంఘానికి గుర్తింపు లభిస్తుంది.

క్రేన్ ఢీ కొని బాలుడి మృతి


మృతుడు మహేష్

పావగడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరమ్మనహళ్లి గేట్ వద్ద నీటి ట్యాంకర్‌ను క్రేన్ ఢీ కొన్న ఘటనలో ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. వైఎన్ హళ్లి గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప, అనిత దంపతుల కుమారుడు మహేష్ (17) బుధవారం సాయంత్రం వీరమ్మనహళ్లి గేట్ వద్ద నిలబడిన నీటి ట్యాంకర్ ఇంజిన్ వద్ద డ్రైవర్‌తో సరదాగా మాట్లాడుతుండగా ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన క్రేన్ ఢీకొంది. దీంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనాస్థలాన్ని సీఐ సురేష్ పరిశీలించి, ప్రమాదానికి కారణమైన క్రేన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయొద్దు

- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి


కేజీబీవీలో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

హిందూపురం టౌన్: ఇష్టంతో చదువుకుని వృద్ధిలోకి రావాలని, ఈ క్రమంలో తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయరాదంటూ విద్యార్థినులకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి సూచించారు. బుధవారం హిందూపురంలోని కేజీబీవీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. అలాగే ఎఫ్‌పీ షాపులను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కేజీబీవీ, వసతిగృహాల్లో విద్యార్థులతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే పౌరసరఫరాల శాఖ, ఐసీడీఎస్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు మార్పులు వచ్చాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే రేషన్ దుకాణాల్లో చక్కెర రూ.17, కందిపప్పు రూ.67 ఉంటే రూ.20, రూ.70 చొప్పున తీసుకుంటున్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారన్నారు. కార్డుకు రూ.6 చొప్పున లెక్కించినా దాదాపు ఒక్కో చౌకదుకాణంలో ఉన్న 500 కార్డులకు సంబంధించి రూ.3వేల వరకు అవినీతి జరిగే అవకాశముందన్నారు. దీనిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు సైతం చౌక దుకాణానికి వెళ్లే సమయంలో సరిపడా చిల్లర తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అశ్వత్థనారాయణ నాయక్, సీఎస్‌డీటీ ఆరతి, ఎంఈఓ గంగప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో తనిఖీ..

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో ఉన్న పీహెచ్‌సీని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫార్మసీ, వార్డు గదులను పరిశీలించారు. గర్భిణులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం మెనుపై విద్యార్థులతో ఆరా తీశారు. ఎర్రమంచి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం 2ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కిష్టప్ప, ఎంఈఓలు సుధాకర్, చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజ్ నాయక్, సీడీపీఓ శాంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కళ్లు కప్పి ఖైదీ పరారీ

సాక్షి, పుట్టపర్తి: పోలీసుల కళ్లు కప్పి రిమాండ్ ఖైదీ పరారైన ఘటన శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో చోటు చేసుకుంది. ఓ ఇంటి స్థల వివాదంలో చిక్కుకుని రిమాండ్ ఖైదీగా ఉన్న రవీంద్రనాయక్‌ను బుధవారం కోర్టుకు హాజరు పరిచేందుకు పెనుకొండకు పోలీసులు తీసుకువచ్చారు. కాసేపటి తర్వాత మూత్ర విసర్జనకు వెళ్లొస్తానంటూ పత్తా లేకుండా పోయాడు. కాగా, పెనుకొండ మండలం అడదాకులపల్లిలో మూడు నెలల క్రితం ఓ ఇంటి స్థలం విషయంలో రవీంద్రనాయక్, శంకర్‌నాయక్ గొడవపడ్డారు. ఘటనలో శంకర్‌నాయక్‌కు బలమైన గాయాలు కావడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రవీంద్రనాయక్, ఆయన కుమారుడు పృథ్వీనాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పృథ్వీనాయక్ ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడు.

వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు

అనంతపురం: అదనపు కట్నం వేధింపుల కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మొబైల్ జడ్జి సుజన్ తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురం నగరానికి చెందిన వెన్నపూస సౌభాగ్యలక్ష్మిని కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన జి.బ్రహ్మానందరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. పెళ్లి సమయంలో వరకట్నం కింద రూ.5 లక్షలను సౌజన్యలక్ష్మి తల్లిదండ్రులు ఇచ్చారు. అయినా మరో రూ.10 లక్షలు తేవాలంటూ భర్త, ఆయన తండ్రి ఆదిరెడ్డి, తల్లి లక్ష్మీదేవి, సోదరుడు చెన్నారెడ్డి, మరదలు జి.కృష్ణకుమారి (చెన్నారెడ్డి భార్య) తనను వేధిస్తున్నారంటూ 2016, ఫిబ్రవరి 28న అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి మొబైల్ కోర్టులో ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో జి.బ్రహ్మానందారెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సుజన్ తీర్పు వెలువరించారు. మిగిలిన నలుగురిని నిర్దోషులుగా పేర్కొన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వి.శ్రీనివాసులు వాదనలు వినిపించారు.

వైభవంగా దర్గాహొన్నూరు స్వామి ఉరుసు

వజ్రకరూరు: మండల పరిధిలోని చాబాల గ్రామంలో భక్తుల కొంగుబంగారం దర్గాహొన్నూరు స్వామి ఉరుసు వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం కొమ్మే పెద్దకుళ్లాయప్ప ఇంటి నుంచి నిర్వహించిన షంషేర్ ఊరేగింపులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో భక్తిశ్రద్ధలతో చక్కెర చదివింపులు చదివించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్రనాయకుడు వై.భీమిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వామి వారి ప్రసాదాలు అందచేశారు. కాగా, ఉరుసు సందర్భంగా స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేక అలంకరించారు. భారీగా అంగళ్లు వెలియడంతో సందడి నెలకొంది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్కెస్ట్రా ఆకట్టుకుంది.


చాబాలలో దర్గాహొన్నూరుస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం




సంగీత విభావరి నిర్వహిస్తున్న గుంటూరు జిల్లా సత్యసాయి భక్తులు, కచేరీ నిర్వహిస్తున్న సరస్వతీవిద్యార్థి, తదితరులు

అలరించిన సంగీత విభావరి

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన గుంటూరు జిల్లా సత్యసాయి భక్తులు బుధవారం మహాసమాధి వద్ద నిర్వహించిన సంగీత విభావరి భక్తులను అలరించింది. సాయంత్రం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు సరస్వతీవిద్యార్థి సంగీత కచేరీతో ఆకట్టుకున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు


రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

- ఫీజు కడితేనే హాల్‌టికెట్లు
- ఎస్కేయూ క్యాంపస్‌లో లా, పీజీ విద్యార్థులకు అల్టిమేటం
- పరీక్ష ఫీజు చెల్లించినా దరఖాస్తుల స్వీకరణకు నిరాకరణ
- నిధులు మంజూరు చేయడంలో కూటమి సర్కారు వైఫల్యం
- ఉద్యమ బాటలో విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఎల్‌ఎల్‌బీ, పీజీ చదివే విద్యార్థుల భవిష్యత్తుతో ఉన్నతాధికారులు ఆటలాడుకుంటున్నారు. బకాయి పడ్డ మెస్‌బిల్లులు చెల్లిస్తేనే పరీక్ష దరఖాస్తులు తీసుకుంటామని స్పష్టం చేయడంతో ఎటూ పాలుపోని స్థితిలో విద్యార్థులు ఉన్నారు. పైసా బకాయి ఉన్నా పరీక్షలకు అనుమతించబోమని పేర్కొనడంతో విద్యార్థులకు దిక్కుతోచని స్థితి నెలకొంది.

దరఖాస్తుల స్వీకరణకు నో..

ఎల్‌ఎల్‌బీ రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు త్వరలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అయితే, పరీక్ష ఫీజులను చలానా రూపంలో బ్యాంకులో చెల్లించిన విద్యార్థులు.. దరఖాస్తు అందించడానికి ప్రిన్సిపాల్ కార్యాలయానికి వెళితే వాటిని తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. మెస్ బకాయిలు చెల్లిస్తేనే దరఖాస్తులు స్వీకరించాలని ఉన్నతాధికారుల ఆదేశాలను తాము అనుసరిస్తున్నామని పేర్కొంటున్నారు. ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్‌లో 79 మంది, నాలుగో సెమిస్టర్‌లో 54 మంది విద్యార్థులు ఉన్నారు. త్వరలో పీజీ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. వీరికి సైతం ఇదే నిబంధనలు వర్తిస్తాయని అధికారులు స్పష్టం చేయడం గమనార్హం.

జీఓ ఇచ్చినా...

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన మొత్తాలను విడుదల చేయలేదు. దీంతో పరీక్షలకు అనుమతించడం లేదని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో ఆగమేఘాల మీద జీఓ జారీ చేశారు. ఫీజు, మెస్ బిల్లు చెల్లించకపోయినా పరీక్షలకు అనుమతించాలని ఆదేశించారు. వీటిని అనుసరించి కలెక్టర్ సర్క్యులర్ జారీ చేశారు. అయినప్పటికీ శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం యాజమాన్యం తనకేమి పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మెస్ బిల్లుల బకాయిలు చెల్లించకపోతే హాస్టళ్ల నిర్వహణ కష్టతరమంటూ సరికొత్త వాదనను తెరపైకి తేవడంపై విద్యార్థులు తీవ్రంగా మండిపడుతున్నారు.

రిజిస్ట్రార్ ఘెరావ్..

విద్యార్థులపై ఫీజుల వేధింపులు ఆపాలంటూ బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ మాట్లాడుతూ వీసీ, రిజిస్ట్రార్‌లు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసే పనిలో నిమగ్నం కావడం గర్హనీయమన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేదని, విద్యార్థులకు వెసులుబాటు కల్పించాలని సాక్షాత్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నప్పటికీ ఖాతరు చేయడం లేదని, విద్యాశాఖ మంత్రి మాటలు నీటి మూటగానే మిగిలిపోయాయని విమర్శించారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలతో తమకు సంబంధం లేదనడం భావ్యం కాదన్నారు. ఇదంతా చూస్తుంటే పైకి ఆదేశాలు ఇస్తూ క్షేత్రస్థాయిలో బకాయిలు వసూలు చేయాలని మంత్రి చెప్పినట్లుగా అర్థం అవుతోందంటూ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శి వంశీ, శివారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి భీమేష్, వీరు, వర్సిటీ నాయకులు మోహన్, చంద్రనాయక్, గణేష్, హరీష్, విష్ణు, ఎర్రిస్వామి, రాముడు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.